క్లుప్తంగా

అతిథిగృహం పరిశీలన

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై పూర్తయిన రెవెన్యూ అతిథిగృహన్ని మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ శనివారం పరిశీలించారు. అతిథిగృహం లీకేజీలు ఉండటం, అసంపూర్తి పనులను సత్వరమే పూర్తి చేయాలని గతంలో రహదారి భవనాలశాఖ అధికారులను ఆదేశించారు. దీంతో పరిశీలించిన ఆయన వివరాలను తహసీల్దార్ మొహమ్మద్ అన్సారీని అడిగి తెలుసుకున్నారు.

విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలు అవసరం

మదనపల్లె సిటీ: విద్యార్థులకు విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలు అవసరమని డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికోన్నత పాఠశాల ప్రిన్సిపాల్ వసుంధరాదేవి అన్నారు. శనివారం 9,10, ఇంటర్మీడియట్ విద్యార్థులను స్థానిక ఇండ్రస్టియల్ ఎస్టేట్‌లోని అపెరల్ కంపెనీని సందర్శించారు. కంపెనీలో అక్కడ ఉపయోగించే మిషన్స్ గురించి హెచ్‌ఆర్ స్వర్ణ వివరించారు. షర్ట్సు ఎలా తయారు చేస్తారు, వాటిని ఎక్స్‌పోర్టు ఎలా చేస్తారనే విషయాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఒకేషనల్ టీచర్ మాళవికస్వాతి, స్వాతి, రమ, శారద తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



ఇందిరమ్మ కాలనీలో ఉచిత వైద్యశిబిరం

పీలేరు : స్థానిక చిత్తూరు మార్గంలోని ఇందిరమ్మ కాలనీలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శనివారం ఉదయం నుంచి తిరుపతి రమాదేవి ఆసుపత్రి వైద్యులు వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు దళవాయి సురేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సుమారు 150 మందికి వివిధ ఆరోగ్య సమస్యలకు సంబంధించి వైద్య సేవలందించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వైద్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ల ఆవిష్కరణ

కేవీపల్లె : ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్లను శనివారం ఎంఈవోలు రెడ్డిబాషా, సుబ్రమణ్యం చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీసీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన డీఏ బకాయిలు, పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని కోరారు. పాత పెన్షన్ విధానం తిరిగి పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో వేణు, నందకుమార్, రాజు, భాస్కర్‌రెడ్డి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


సచివాలయంలో ప్రింటర్ ఏర్పాటు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని పట్టెంవాండ్లపల్లి గ్రామ సచివాలయంలో ప్రింటర్ పని చేయక ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. ఎలాంటి ధ్రువ పత్రాలు అవసరమైనా ప్రజలంతా సమీపంలోని పక్క గ్రామాల సచివాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో 'ప్రింటర్ లేక ప్రజల అవస్థలు' అని ఇటీవల సాక్షి పత్రికలో వెలువడిన వార్తపై అధికారులు స్పందించారు. ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని సచివాలయంలో ప్రింటర్ ఏర్పాటు చేశామని సర్పంచ్ పూజారి లక్ష్మిదేవి, కార్యదర్శి నాగరాణి శనివారం పేర్కొన్నారు.

శ్మశానవాటికల దారులు శుభ్రం చేయండి

మదనపల్లె : పట్టణంలోని పలు హిందూ శ్మశానవాటికలకు వెళ్లే దారుల్లో ముళ్లకంపలు, చెత్తాచెదారాన్ని తొలగించి, శుభ్రంగా ఉంచాలని మాజీ సైనికుల సంఘం డివిజన్ అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసులునాయుడు కోరారు. శనివారం మున్సిపల్ మేనేజర్ మనోహర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పట్టణశివారు ప్రాంతాలైన అంకిశెట్టిపల్లె, చిప్పిలి మిల్క్‌డెయిరీ, కొత్త ఇండ్లు, బీకే.పల్లె, పెద్దతోపు, శ్మశానవాటికలు ముళ్లచెట్లు, చెత్తాచెదారాలతో నిండిపోయి ఉన్నాయన్నారు. దీంతో శ్మశానంలోకి వెళ్లేందుకు దారి లేక అంతిమయాత్ర కొనసాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు జేసీబీలతో ముళ్లపొదలు తొలగించి, దారి సౌకర్యం కల్పించాల్సిందిగా కోరారు.

శ్రీలక్ష్మీనరసింహుడికి విశేషపూజలు



గుర్రంకొండ: తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం టీటీడీ ఆధ్వర్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు చేశారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని పలురకాల రంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని సేవించుకొన్నారు.

తూముల ద్వారా చెరువులకు కృష్ణా జలాలు

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 31 చెరువులకు నీళ్లు తరలించేలా ఏర్పాట్లు
- ఇప్పుడు లైనింగ్ అంటున్న ప్రభుత్వం
- మొదట దీనిపై చర్యలు తీసుకోవాలి
- లేదంటే చెరువులు ఎండాల్సిందే



పుంగనూరు ఉపకాలువ నుంచి ఏర్పాటు చేస్తున్న తూము (ఫైల్)

బి.కొత్తకోట: హంద్రీ–నీవా ప్రాజెక్టు పుంగనూరు ఉపకాలువ నుంచి తంబళ్లపల్లె నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 31 చెరువులకు కృష్ణా జలాలను తరలించి నింపేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. కాలువ సాగే పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, ములకలచెరువు, కురబలకోట మండలాల పరిధిలో కాలువకు సమీపంలోని చెరువులను గుర్తించి వాటికి నీటిని అందించే తూములను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కాలువకు లైనింగ్ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. దీంతో ఈ తూములపై రైతాంగంలో ఆందోళన మొదలైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన తూములను పటిష్ట పరచాలన్న డిమాండ్ చేస్తున్నారు.

కరువును పారద్రోలేలా..

ఈ నాలుగు మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొంటూ వ్యవసాయం సాగక రైతులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతానికి శాశ్వత నీటి వనరులు లేకపోవడంతో గత ప్రభుత్వం 91 చెరువులకు కృష్ణా జలాలను తరలించి నింపింది. ఇలా చేయడం ద్వారా భూగర్భజలాలు వృద్ధి చెందడమే కాక ఆయకట్టు భూములు సాగులోకి వస్తాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డి చర్యలు చేపట్టారు. మూడు మండలాల్లోని చెరువులకు నీళ్లు వెళ్లేలా కాలువ వెంబడి తూములను నిర్మింపజేశారు. తూముల నుంచి విడుదలయ్యే నీళ్లు నేరుగా చెరువులోకి చేరి నిండుతుంది. అక్కడి నుంచి వీలైతే మరో చెరువుకు నీళ్ల ప్రవహించేలా ఏర్పాట్లు చేశారు. గత ప్రభుత్వంలో ఈ ప్రయత్నం ఫలించి చెరువులు నిండాయి.

ఆ 31 చెరువులు ఇవే..

పెద్దతిప్పసముద్రం మండలంలో దేవప్పచెరువు, దొరిగుండ్లవారిపల్లె చెక్‌డ్యామ్, మద్దయ్యగారిపల్లె చెక్‌డ్యామ్, కొత్తపల్లె చెక్‌డ్యామ్, ఓటుకుంట, రేకులకుంట, సాలేవాండ్లపల్లెకుంట, బి.కొత్తకోట మండలంలో బాపనకుంట, పోమ్మచ్చినకుంట, రంగసముద్రం చెరువు, కానుగలకుంట, పెద్దచెరువు, పెద్దినాయునికుంట, బట్నాయునిచెరువు, బయ్యమ్మకుంట, తిమ్మసానిచెరువు, కాశప్పకుంట, నక్కోళ్లచెరువు, మాలకుంట, ఎర్రమ్మచెరువు, మన్నేచెరువు, పెద్దపల్లిచెరువు, కురబలకోట మండలంలో శీతివారిపల్లె చెరువు, అప్పాలమ్మ చెరువు, బుర్రాచెరువు, రంగప్పచెరువు, పీనిగలచెరువు, గోపాలచెరువు, నల్లబయ్యమ్మచెరువు, రామక్క చెరువు, రంగమ్మచెరువులకు నీళ్లు తరలించే తూములు, వాటికి పైప్‌లైన్లను వేసి సిద్ధంగా ఉంచారు.

లైనింగ్‌తో పనులు చేయాలి

కాలువకు లైనింగ్ పనులు చేసే సమయంలోనే ప్రభుత్వం ఈ తూములను పటిష్ఠ పరచాలని రైతులు కోరుతున్నారు. లైనింగ్ పనుల్లో తూములను మూసివేయకుండా వాటికి నీళ్ల తరలించే విధంగా శాశ్వతంగా పనులు చేపట్టి పూర్తి చేయాల్సి ఉంది. కాలువ వెడల్పు పనులు చేసి ఉంటే తూముల పనులు మరింత పటిష్టంగా చేపట్టే వీలుండేది. ప్రస్తుతం లైనింగ్ పని మాత్రం ఉండటంతో తూము పనులపై శ్రద్ధ చూపి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రతి సీజన్‌లో నీళ్లు ఇవ్వాలి



కాలువకు కృష్ణా జలాలను తరలించే ప్రతి సీజన్‌లో దీని పరిధిలోని చెరువులకు తూముల ద్వారా నీళ్లు ఇవ్వాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ పనులు చేయించాం. టీడీపీ ప్రభుత్వం పిల్ల కాలువ తవ్వకం పనులను పక్కన పెట్టడంతో చెరువులు, ఆయకట్టు భూమికి సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. **- ద్వారకనాథరెడ్డి, ఎమ్మెల్యే**

పక్కాగా పనులు చేస్తాం



కాలువ వెంబడి ఇప్పటికే ఎక్కడెక్కడ తూములు ఏర్పాటు చేశారో అక్కడ సాంకేతికంగా అన్ని పనులు పక్కాగా పూర్తి చేయిస్తాం. చెరువులకు నీళ్ల తరలించే విధంగా చేసిన పనులను పరిశీలించి వాటిపై ఇంకా చేయాల్సిన పనులు ఉంటే వాటిని కూడా పూర్తి చేయిస్తాం. తూముల ద్వారా ఆయా చెరువులకు నీళ్ల వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. **-సీఆర్ రాజగోపాల్, ఎస్ఈ, హెచ్ఎన్ఎస్ఎస్**

పక్కా గృహాల వేగవంతానికి చర్యలు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దతిప్పసముద్రం: పక్కా గృహాల వేగవంతానికి చర్యలు చేపడుతున్నామని హౌసింగ్ డీఈ వెంకటరెడ్డి అన్నారు. శనివారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో మండలంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెలుగు సీసీలు, సంఘమిత్రలతో సమీక్షించారు. ఈ సందర్భంగా డీఈతో పాటు ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఏపీఎం హరి, ఏఈ శ్రీనివాసులు మాట్లాడుతూ గృహాలు మంజూరై అసంపూర్తిగా నిలిపేసిన లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు చేపట్టకపోవడానికి కారణాలు తెలుసుకోవాలని సంఘమిత్రలకు సూచించారు. అలాగే గృహాలు మంజూరైన లబ్ధిదారుల్లో ఎంత మంది డ్వాక్రా సంఘంలో ఉన్నారు.. వారికి రుణాలు మంజూరు చేస్తే ఎంత మంది నిర్మాణాలు చేపడతారు, సంఘాల్లో లేని వారి సంఖ్య, మాకు ఎలాంటి రుణాలు అవసరం లేదని చెప్పే లబ్ధిదారులు ఎంత మంది ఉన్నారో సమగ్రంగా గుర్తించాలన్నారు. మండలంలో 614 మంది లబ్ధిదారుల గృహాలు అసంపూర్తిగా ఉన్నట్లు గుర్తించామని అధికారులు పేర్కొన్నారు.

అంగన్‌వాడీలపై వేధింపులు ఆపాలి

– సబ్ కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల నిరసన



సబ్ కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల నిరసన

మదనపల్లె : అంగన్‌వాడీ సిబ్బందిపై అధికారుల వేధింపులు అధికమయ్యాయని, వాటిని తట్టుకోలేక సిబ్బంది ఆత్మహత్యలకు పాల్పడుతుండటం శోచనీయమని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రాజేశ్వరి, మధురవాణి, అన్నారు. రామసముద్రం మండలంలో ఐసీడీయస్ సూపర్‌వైజర్ వేధింపులు తాళలేక కొండూరు అంగన్‌వాడీ కార్యకర్త లావణ్య ఆత్మహత్యకు ప్రయత్నించిన నేపథ్యంలో సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు తక్కువగా ఉన్నారని, .సూపర్‌వైజర్ చంద్రకాంత మానసికంగా వేధింపులకు గురిచేసిన నేపథ్యంలో లావణ్య ఆత్మహత్యకు ప్రయత్నించి చావుబతుకుల మధ్య ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు తక్కువ ఉంటే, కార్యకర్తలది బాధ్యత కాదని, అధికారుల వేధింపులు వివిధ రూపాల్లో ఉంటున్నాయని, ఇవి ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. అంగన్‌వాడీలను వేధిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా కోశాధికారి టి.హరిశర్మ తదితరులు ఉన్నారు.

ఆలయ భూముల సంరక్షణకు చర్యలు

–జిల్లా అధికారి విశ్వనాథ్



సదస్సులో ఫిర్యాదులు పరిశీలిస్తున్న విశ్వనాథ్

బి.కొత్తకోట: జిల్లాలోని ఆలయాల మాన్యం భూముల సంరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని గోళ్లపల్లెలో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ భూములకు సంబంధించిన ఫిర్యాదులు, కౌలుదారుల వినతులపై స్పందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమశాఖ నుంచి ఈవోలు, ఇన్స్‌పెక్టర్లు, ఉద్యోగులు రెవెన్యూ సదస్సులకు హాజరై ఆలయాల భూముల మ్యూటేషన్లు, రికార్డుల్లో మార్పుల కోసం, సర్వే, ఆక్రమణదారుల గుర్తింపునకు అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతోందని చెప్పారు. భూములను ఆక్రమించిన వారికి నోటీసులు జారీ చేసి వాటిని తొలగిస్తామని చెప్పారు. ఆలయ భూములను చాలా కాలంగా కౌలుకు సాగు చేసుకొంటూ అనుభవిస్తున్న వారు కౌలు చెల్లించడం లేదన్నారు. వీరు తక్షణమే కౌలు చెల్లించి రశీదులు పొందాలని కోరారు. రైతుల నుంచి 26 ఫిర్యాదులను స్వీకరించారు. తహసీల్దార్ మొహమ్మద్ అన్సారీ, ఈవో మునిరాజ, సర్వేయర్ ముబాకర్, విఆర్ఓ నాగేంద్ర, సచివాలయ సర్వేయర్ శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు



మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె : విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చే దిశగా కూటమిప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ప్రభుత్వ కళాశాలల్లో హాజరుశాతం, ఫలితాల మెరుగుదలే లక్ష్యంగా, కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం తీసుకురావడం జరిగిందన్నారు. విద్యార్థులకు ఇంటర్మీడియట్ ఎంతో కీలకదశని, మాదక ద్రవ్యాలు, గంజాయి తదితర చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి, ఎంఈఓలు ప్రభాకరరెడ్డి, రాజగోపాల్, సిబ్బంది రెడ్డెప్పరెడ్డి, మహమ్మద్‌ఖాన్, టీడీపీ నాయకులు షంషీర్, సంగంహరి, శ్రీరామవినోద్, చిన్నమహేష్, సురేంద్ర పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు తోడ్పాటు

నిమ్మనపల్లె : రాష్ట్ర ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అమలు చేయడం ద్వారా ఉన్నత విద్యకు చక్కని తోడ్పాటు అందిస్తోందని ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం నిమ్మనపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్, ఎంఈఓ నారాయణ లతో కలసి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు స్వయంగా వడ్డించారు. భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, కళాశాల అధ్యాపకులు ఎం.రాధాకృష్ణ, ఎన్ఎస్ఎస్ పిఓ పి.ఇందుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ చిట్టిబాబు, కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ, ప్రభుత్వ కళాశాలలో హాజరుశాతం, మెరుగైన ఫలితాల సాధన లక్ష్యంగా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు హేమలత, ఆంజనేయులు, ఎంపీడీఓ భానుప్రసాద్, కూటమినాయకులు పాల్గొన్నారు.

వెలుగు కార్యాలయంలో ఉద్రిక్తత

బి.కొత్తకోట: వెలుగు మహిళా సంఘం నుంచి ఓ సభ్యురాలిని తొలగించడం, దానిపై ఆ మహిళ సిబ్బందిపై చేసిన అవినీతి ఆరోపణలపై శనివారం వెలుగు ఏపీఎం రాజేశ్వరీ విచారణ చేపట్టగా ఉద్రిక్త పరిస్థితి నెలకొని పోలీసులు రంగ ప్రవేశం చేయాల్సి వచ్చింది. దీనికి సంబంధించి వివరాలిలా.. స్థానిక వాయలవంక ప్రాంతానికి చెందిన డి.నారాయణమ్మ ఓ మహిళా సంఘంలో సభ్యురాలిగా ఉంటున్నారు. ఆమెను సంఘం నుంచి తొలగించడంతో వివాదానికి కారణమైంది. తనకు తెలియకుండా ఫోర్జరీ సంతకాలతో బ్యాంకు నుంచి తనకు మంజూరైన రుణం కాజేశారని, ఎవరెవరు తన నుంచి లంచం అడిగిన వారి పేర్లతో బ్యాంకు మేనేజర్‌కు ఫిర్యాదు చేయగా అదే ఫిర్యాదును సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. దీంతో ఏపీఎం నారాయణమ్మను, సంఘ లీడర్లను విచారణకు పిలిపించారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య వాగ్వాదం, పరస్పర ఆరోపణలు చేసుకోంటూ ఉద్రిక్తత సృష్టించారు. సీసీలు పోలీస్‌స్టేషన్ వెళ్లి సమాచారం ఇవ్వడంతో ఇద్దరు కానిస్టేబుళ్లు వెలుగు కార్యాలయం చేరుకుని శాంతింపజేశారు.

భూసమస్యల పరిష్కారమే ధ్యేయం

మదనపల్లె : భూసమస్యలు పరిష్కారమే ధ్యేయంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. శనివారం మండలంలోని పొన్నేటిపాళెం పంచాయతీ చిప్పిలి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ.. భూసమస్యల పరిష్కారం, రైతులు తమ సందేహాలను సదస్సుల ద్వారా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పట్టాదారు, భూసమస్యలు పరిష్కరించుకోవాలని రైతులకు సూచించారు. సమావేశంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘువేంద్ర, నోడల్‌ఆఫీసర్ అమరనాథరెడ్డి, తహసీల్దార్ ఖాజాబీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి



రాఘవేంద్రకు మెమొంటో అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్

మదనపల్లె సిటీ: విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి అన్నారు. శనివారం కాలేజీలో ఐఐసి సహకారంతో ఇన్నోవేషన్ డెవలప్‌మెంట్,టెక్నాలజీ రెడీనెస్ లెవల్‌పై సెమినార్ నిర్వహించారు. విద్యార్థులు సరికొత్త అంశాలను ఆవిష్కరించాలన్నారు. ఇందు కోసం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీష్, టెక్నికల్ ఆర్కిటెక్ట్ రాఘవేంద్ర, హెచ్ఓడిలు మహమ్మద్ రఫీ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అంధులకు ఆరాధ్యుడు బ్రెయిలీ



బి.కొత్తకోట: బ్రెయిలీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈఓ, టీచర్లు

బి.కొత్తకోట: అంధులకు బ్రెయిలీ ఆరాధ్యుడని ఎంఈవో రెడ్డిశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని గట్టు జెడ్పీ హైస్కూల్‌లో ప్రపంచ బ్రెయిలీ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంఈవో మాట్లాడుతూ అంధుడైన బ్రెయిలీ చిన్నతనంలోనే చూపుకోల్పోయినా అంధుల కోసం ఆరు చుక్కల లిపిని కనుగొన్నారని అన్నారు. ఈ లిపి ఎందరికో మార్గదర్శమైందని అన్నారు. హెచ్ఎం మహబూబ్ బాషా, ఉపాధ్యాయులు ఆదినారాయణ, రాజేశ్వరీ, ఐఈఆర్‌టీ టీచర్ బాలాజీ, శ్రీనివాసులు, ఎస్ఎంసీ చైర్మన్ రమేష్ పాల్గొన్నారు.

బ్రెయిలీ లిపి అంధుల పాలిట వరం

మదనపల్లె సిటీ: లూయిస్ బ్రెయిలీ లిపి అంధుల పాలిట గొప్పవరమని ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్ అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ 216వ జయంతి వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దివ్యాంగులకు భవిత కేంద్రంలో సేవలు అందిస్తున్నామన్నారు. అందరి పిల్లలతో పాటు దివ్యాంగులకు ప్రత్యేక విద్యను నేర్పించడం జరుగుతుందన్నారు. అనంతరం దివ్యాంగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుబ్బారెడ్డి, వికలాంగుల సంఘం అధ్యక్షులు మౌలాలి, సహిత విద్య ఉపాధ్యాయులు నాగేంద్ర, రెడ్డమ్మ, కేర్‌టేకర్ రెడ్డిరాణి తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలి



ప్రమాణస్వీకారం చేసిన వాసవీక్లబ్, వాసవీ వనిత క్లబ్ నూతన కార్యవర్గం

మదనపల్లె సిటీ: వాసవీ క్లబ్, వాసవీ మహిళా క్లబ్ సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని వాసవీ ఇంటర్‌నేషనల్ గవర్నర్ తేజయశ్వసిని గుప్తా అన్నారు. శనివారం స్థానిక ఆర్యవైశ్యహాస్టల్ నందు మదనపల్లె వాసవీక్లబ్, వాసవీ మహిళా క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. వాసవీ ఇంటర్‌నేషనల్ అధ్యక్షులు రామకృష్ణ ఆదేశాల మేరకు ఈ ఏడాది కొత్తగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నూతన కార్యవర్గం మరింత చురుగ్గా పని చేయాలని కోరారు. అనంతరం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. వాసవీ క్లబ్ అధ్యక్షులుగా పూనగంటి అమరనాథ్, ప్రధాన కార్యదర్శి మునిరాజ, కోశాధికారి కిషోర్‌బాబు, వాసవీ మహిళా క్లబ్ అధ్యక్షురాలిగా ఎం.శ్వేత, కార్యదర్శిగా భానురేఖ, కోశాధికారిగా సంధ్య ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య అధ్యక్షులు ఓంప్రకాష్, వాసవీ ఇంటర్‌నేషన్ అదనపు కోశాధికారి నాగసుప్రజ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే బాదుడే

- భారీగా పెరిగిన జరిమానాలు
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు



ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రవికుమార్

పెద్దతిప్పసముద్రం: ఇక నుంచి వాహనదారులు ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమిస్తే జేబులకు చిల్లులు తప్పవు. గతంలో కన్నా ఈ సారి భారీగా జరిమానాలు పెరిగాయని పోలీసులు అంటున్నారు. ఈ విషయంపై ఎస్ఐ రవికుమార్ సిబ్బందితో కలసి శనివారం వాహనదారులకు కర పత్రాలను అందజేస్తూ కొత్త చట్టాలను వివరించారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ.5 వేలు, వేగంగా వాహనాలు నడిపితే రూ.1,000లు, ప్రమాదకరమైన డ్రైవింగ్ చేస్తే రూ.5 వేలు, మద్యం సేవించి వాహనాలు నడిపితే రూ.10 వేలు, రేసింగ్ స్పీడుతో డ్రైవ్ చేస్తే రూ.5 వేలు, హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే రూ.1,000 జరిమానాతో పాటు మూడు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దుకు సిఫారసు చేయనున్నట్లు తెలిపారు. సీట్ బెల్ట్ ధరించకపోతే రూ.1,000, అత్యవసర వాహనాలను అడ్డుకుంటే రూ.10 వేలు, ట్రిపుల్ రైడింగ్ చేస్తే రూ.1,200లు, ఓవర్ లోడ్‌తో ద్విచక్ర వాహనాలు నడిపితే రూ.2 వేల జరిమానాతో పాటు మూడు నెలల పాటు లైసెన్స్ రద్దు, ఇన్సూరెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ.2 వేలు జరిమానా చెల్లించేలా చట్టం వచ్చినట్లు తెలిపారు. అలాగే మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలు చేస్తే వారి కన్నవాళ్ళు శిక్షార్హులు అవుతారని, అంతేగాక మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే రూ.25 వేలు జరిమానా చెల్లించాల్సిందేనని పోలీసులు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాలతో పాటు నూతన రహదారి భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

బి.కొత్తకోట: స్థానిక ప్రభుత్వం జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం కమిషనర్ జీవీ.పల్లవి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఈ పథకం అమలు చేయడం ద్వారా ఇబ్బందులు తొలుగుతాయన్నారు. ఎంఈవో రెడ్డిశేఖర్ మాట్లాడుతూ గతంలో ఉన్న ఈ పథకాన్ని ప్రభుత్వం మళ్లీ ప్రారంభించిందని అన్నారు. ప్రిన్సిపాల్ గోపాల్ నాయక్, ఎంఈవో–2 భీమేశ్వరాచారీ, విద్యార్థులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో..

ములకలచెరువు: స్థానిక మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర రవాణా, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ... త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమాల్లో మదనపల్లి సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, తంబళ్లపల్లె నియోజకవర్గ నాయకులు జయచంద్రారెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం సద్వినియోగ చేసుకోవాలి

కేవీపల్లె : డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం సద్వినియోగ చేసుకోవాలని ఎంఈవో రెడ్డిబాషా అన్నారు. శనివారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా స్థానిక ఏపీ మోడల్ స్కూల్ నందు 102 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రెడ్డిప్రదీప్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: స్థానిక మోడల్ స్కూల్‌లోని ఇంటర్ విద్యార్థులకు శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్యక్రామన్ని ఎంఈఓ నారాయణ ప్రారంభించారు. విద్యార్థుల ఆకలి తీర్చడమే గాక చదువుపై ఆసక్తి పెంచడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రిన్సిపాల్ శివకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

పెద్దమండ్యం: ప్రభుత్వ కళాశాలల్లో ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు చర్యలు చేపట్టినట్లు ఎంపీడీఓ శ్రీధర్‌రావు తెలిపారు. మండలంలోని కలిచెర్ల జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల తరహాలో కళాశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంతో ఇబ్బందులు లేకుండా పోతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నాయిని అమరనాథ్, వైస్ ప్రిన్సిపల్ రవీంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలికిరి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ఎంవీ విజయ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మధ్యాహ్న భోజనం పథకంతో విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందుతుందని, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.